క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి

జగిత్యాలజోన్: మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మాతాశిశు సంరక్షణాధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళలకు ఈనెల 17 నుంచి వచ్చేనెల 2 వరకు గ్రామాల్లో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా ఏపీడీ సునీత మాట్లాడుతూ.. త్వరలో ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తామన్నారు. డీపీఎం రమేశ్, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ హరిణి, జిల్లా ఏపీఎంలు వి.గంగాధర్, ఎంఎ హుస్సేన్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరోజన, కార్యదర్శి ఆమని, కోశాధికారి హరిత, 18 మండలాల సమాఖ్య అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షలు

పెగడపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థనారీ–స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం మహిళలు, మానసిక వ్యాధిగ్రస్తులకు వైద్య బృందం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మహిళలకు బీపీ, మధుమేహం, కాన్సర్, ఎనీమియా, గర్భవతులకు పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. మానసిక వైద్య నిపుణులు సాకేత్‌రెడ్డి, వైద్యాధికారి నరేశ్, ఆయుష్ డాక్టర్ వినయకుమారి, ఆర్‌బీఎస్‌కే డాక్టర్లు వెంకటేశ్, ఉమమహేశ్వరి పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, వైద్యాధికారి నరేశ్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.

ప్రత్యేక వైద్యశిబిరాలు

సారంగాపూర్: సారంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్టు వైద్యులతో 3 రోజులపాటు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాధారెడ్డి పేర్కొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్య గుట్ట వద్ద అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన స్వస్థ నారీకి విశేష స్పందన లభించింది. డాక్టర్లు శిల్ప, స్వాతి లక్ష్మణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

మేడిపల్లి: వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా భీమారం మండలం ఒడ్యాడ్ గ్రామంలో ప్రముఖ స్వచ్ఛంద సేవకుడు అంగడి ఆనంద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఉమ్మడి మేడిపల్లి బీజేపీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు.

టీబీ నివారణకు చర్యలు

మెట్‌పల్లి: టీబీ నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మండల వైద్యాధికారి అంజిత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీబీ చాంపియన్ శిక్షణ నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. జిల్లా టీబీ లీడ్ రవి, టీబీ చికిత్స సూపర్‌వైజర్ ఆంజనేయులు, సీహెచ్‌వో సుల్తానా, సూపర్‌వైజర్ అచ్యుత్ రావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

జగిత్యాలరూరల్: నర్సింగాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఉచిత ఎనీమియా పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, కోశాధికారి డాక్టర్ సుధీర్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ శ్రీలత, డాక్టర్ సుమన్, ప్రధానోపాధ్యాయురాలు నరేందర్, పీఆర్టీయూ రాష్ట్ర నాయకుడు హరీశ్ పాల్గొన్నారు.

ఉపాధిలో అక్రమాలు

మల్లాపూర్: ఉపాధిహామీ పనులు, కూలీల వేతనాలు చెల్లింపు, నర్సరీల నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. రూ.1,26,722 వరకు స్థానిక సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు ప్రజావేదికలో వెల్లడైనట్లు డీఆర్డీవో పీడీ రఘువరన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ఉపాధిహామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్నారు. 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 30, 2025 వరకు మండల కేంద్రం తోపాటు అన్ని గ్రామాల్లో రూ.5,10,50,799తో ఉపాధిహామీ పనులు, కూలీలకు వేతన చెల్లింపు, వన నర్సరీల నిర్వహణ చేపట్టారని పేర్కొన్నారు. ఈ పనుల తోపాటు నిధుల వినియోగంపై 13 బృందాలతో ఇంటింటా సర్వే చేయించినట్లు తెలిపారు. 469 పనులకు సంబంధించి ఈ సామాజిక తనిఖీ ప్రజావేదికలో మండలవ్యాప్తంగా రూ.1,26,722 నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, వీరి వద్ద నుంచి రికవరీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కొన్ని పంచాయతీల ఉపాధిహామీ పనుల రికార్డులను ఆడిట్ అధికారుల అందజేయకపోవడం, పనులకు సంబంధించి ఎంబీ రికార్డు లేకున్నా బిల్లుల చెల్లించడంపై ఏపీవో సతీశ్‌ను డీఆర్డీవో రఘువరన్ తీవ్రంగా మందలించారు. ఎస్టీఎం సాయి జ్ఞానేందర్, ఎస్ఆర్పీ దేవేందర్, ఏపీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, సోషల్ ఆడిట్ అసిస్టెంట్ మేనేజర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

బుగ్గారం: మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులను స్థానిక అధికారులు, నాయకులు గురువారం పరిశీలించారు. బుగ్గారం గ్రామానికి మొత్తం 40 ఇళ్లు మంజూరు కాగా.. స్థానిక అధికారుల పర్యవేక్షణలో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

మురికినీరు.. రోగాలు ముసురు

- తొలగిస్తే చుట్టుపక్కల ప్రజలకు మేలు
- కుంట అభివృద్ధికి నిధులు కేటాయించాలంటూ విన్నపం
- ఇప్పటికే కలెక్టర్‌కు లేఖ రాసిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



మాదిగకుంటలో ఉన్న మురికినీరు

రాయికల్: పట్టణంలోని నడిబొడ్డున ఉన్న మాదిగ కుంట మురికినీటితో కలుషితమవుతూ పట్టణ ప్రజలు రోగాలపాలవుతున్నారు. పట్టణంలోని పలు వార్డులకు సంబంధించిన మురికినీరంతా మాదిగకుంటలో చేరడంతో.. దోమల స్వైర విహారంతో మలేరియా జ్వరాలతో బాధ పడుతున్నారు. రాయికల్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.15కోట్లు మంజూరయ్యాయి. మాదిగకుంటలో నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఇటీవల కలెక్టర్‌కు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది.

2.39 ఎకరాల్లో..

పట్టణంలోని 803 సర్వే నంబర్‌లో 2.39 ఎకరాల్లో మాదిగకుంట ఉండగా.. గతంలో కొంతమంది ఆక్రమణదారులు కబ్జాకు గురి చేశారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి ఉన్న భూమిని అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు హద్దు రాళ్లు పెట్టారు. ప్రస్తుతం ఈ భూమి మొత్తం కలుషిత నీరు చేరడంతో.. పిచ్చి మొక్కలు పెరిగి రూ.కోట్లాది భూమి నిరుపయోగంగా మారుతోంది. ఇందులో ఉన్న నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని, ఎస్సారెస్పీ నీటితో కుంటను నింపి హుస్సేన్‌సాగర్‌ను తలపించేలా చూడాలని కోరుతూ జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి, కలెక్టర్‌కు లేఖ రాశారు.

నిధులు కేటాయించాలి

మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన డెవలప్‌మెంట్ నిధుల నుంచి మాదిగకుంటలో మురికినీరు తొలగించేందుకు డ్రెయినేజీ వ్యవస్థను సరి చేసేందుకు గాను రూ.2కోట్లు కేటాయించాలని, తద్వారా ఇరిగేషన్ అధికారులు ఎస్సారెస్పీ నీటిని మాదిగకుంటలో మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

మాదిగకుంట అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15కోట్ల నుంచి రూ.2కోట్ల నిధులను కేటాయించి కలుషిత నీటిని తొలగించాలి. ఎస్సారెస్పీ నీటిని మాదిగకుంటలో నింపేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి. – జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి



పనులు చేపడతాం



మాదిగకుంటలో నిల్వ ఉన్న నీటిని తొలగించేలా చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా రూ.15కోట్ల నిధుల నుంచి మాదిగకుంట అభివృద్ధికి నిధులు కేటాయించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపడతాం. – మనోహర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్

జూనియర్ లైన్‌మన్‌ను నియమించాలి



దీఈకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి గ్రామంలో జూనియర్ లైన్‌మన్‌ను నియమించాలని గురువారం ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌కు రైతులు విన్నవించారు. వేములకుర్తి సబ్ స్టేషన్ పరిధిలో బర్దీపూర్, మూలరాంపూర్, వేములకుర్తి గ్రామాలకు లైన్‌మన్ ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, దీంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఏఈ సతీశ్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ అంకతి రాజన్న, రైతులు రాధరాపు దేవదాస్, మాలేపు శంకర్, లక్ష్మీనారాయణ, రాజేందర్, శ్రీనివాస్, మల్లేశ్, కోటగిరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ



ధర్మపురి: పట్టణంలో గురువారం స్వచ్ఛతాహీ సేవాపై ర్యాలీ నిర్వహించారు. సీడీఎంఏ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ చేపట్టారు. స్థానిక గాంధీ, నంది కూడళ్ల వద్ద మానవహారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ తిరుపతి, కేజీబీవీ, మహాత్మా జ్యోతిబాపూలే కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు, వెటర్నరీ డాక్టర్ వేణుగోపాల్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ వెళ్తోంది.. పట్టుకోండి



తహసీల్ కార్యాలయం వద్ద పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్

ఇబ్రహీంపట్నం: ఆర్డీవో శ్రీనివాస్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఓ ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. యామపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించేందుకు కలెక్టర్ వచ్చారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్ కూడా ఉన్నారు. వీరికి తిమ్మాపూర్ వద్ద ఇసుకతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ ఎదురైంది. ఆర్డీవో వెంటనే తహసీల్దార్ వరప్రసాద్‌కు ఫోన్ చేశారు. అప్రమత్తమైన తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందికి ఫోన్ చేసి చెప్పడంతో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్ కార్యాలయానికి తరలించారు. సదరు ట్రాక్టర్ మల్లాపూర్ మండలం నుంచి అనుమతి లేకుండా ఇబ్రహీంపట్నం మండలానికి ఇసుక తరలిస్తున్నట్లు తెలిసింది.

ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపిక



జగిత్యాలరూరల్: పొలాసలో ఈనెల 8, 9ల్లో జరిగిన మండలస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో పొలాస జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ అజయ్‌బాబు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనగా.. 21 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్, మాజీ సర్పంచులు నందయ్య, నరేశ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

జీపీఎఫ్ ప్రతిపాదనలు జెడ్పీలోనే స్వీకరించాలి



డిప్యూటీ సీఈవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: జిల్లాలోని జిల్లాపరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల జెడ్పీ జీపీఎఫ్‌కు సంబంధించిన పార్ట్ ఫైనల్, ఫైనల్ పేమెంట్, మిస్సింగ్ క్రెడిట్ వంటి ప్రతిపాదనలు జెడ్పీలోనే స్వీకరించాలని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంగూరి సురేశ్, శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో డిప్యూటీ సీఈవో నరేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

అంగన్‌వాడీ సేవలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న నరేశ్‌కుమార్

మల్యాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలపై విస్తృత అవగాహన కల్పించాలని, తల్లులు, గర్భిణులు, పిల్లలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి బి.నరేశ్ కుమార్ అన్నారు. మనాల గ్రామంలోని రైతు వేదికలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం మల్యాల ప్రాజెక్టు పరిధిలోని మల్యాల, పెగడపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమంతోపాటు పోషణ మాసాన్ని ప్రారంభించారు.

పోషకాహార పదార్థాలతోనే ఎదుగుదల

రాయికల్: ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహార పదార్థాలతోనే చిన్నారులు ఎదుగుతారని సీడీపీవో మమత, సుల్తానా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పోషణ్‌బీ పడాయిబీ మూడో రోజు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెండి కొండ.. సోమేశ్వర గుట్ట



మల్లాపూర్: మండల కేంద్రం శివారులో గురువారం వెండి కొండను తలపించేలా సోమేశ్వర కొండపై సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. వెండిని కరిగించి కొండపై నుంచి ధారపోసినట్లుగా వరద నీటి ధారలు కిందకి జాలువారుతుండగా.. సూర్య కిరణాల ప్రసరణతో వెండి ధారలుగా అద్భుత దృశ్యాన్ని తలపించింది. ఈ సుందరమైన దృశ్యాన్ని తిలకించిన మల్లాపూర్ గ్రామస్తులు పరవశించిపోయారు.

స్వయం విత్తనోత్పత్తితో అధిక దిగుబడి



పొలం పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మల్యాల: రైతులే స్వయంగా విత్తనోత్పత్తి చేపట్టాలని, తద్వారా అధిక పంట దిగుబడితో రైతు ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సుమలత అన్నారు. మల్యాల, ముత్యంపేట గ్రామాల్లో గురువారం నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం కార్యక్రమంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సుమలత పొలాలను సందర్శించారు. రైతులకు విత్తనోత్పత్తిపై అవగాహన కల్పించారు. ఏవో చంద్రదీపక్, ఏఈవో కారుణ్యకుమార్, మంజుల, ఎ.శ్రీనివాస్, ఇ.శ్రీనివాస్, రైతులు కొమ్ముల కమలాకర్ రెడ్డి, డబ్బు గోవర్ధన్‌రెడ్డి, బాపురెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

పెగడపల్లి: నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సాగుతో అధిక దిగుబడులు సాధించొచ్చని పొలాస వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు సుమలత, రామకృష్ణ అన్నారు. అయితిపల్లి గ్రామంలో గురువారం నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో శ్రీకాంత్, ఏఈవోలు పవన్, సరోజిని పాల్గొన్నారు.

కొడిమ్యాల: జగిత్యాల శాస్త్రవేత్తలు డా.రామకష్ణ, డా.సుమలత నాచుపల్లి, డబ్బుతిమ్మాపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వరి పొలాలను సందర్శించి సూచనలు చేశారు.

ఇష్టపడి చదివితే విజయం మీదే..

సారంగాపూర్: విద్యార్థులు పట్టుదలతో ఇష్టపడి చదివితే విజయం మీదే అవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, లీడ్ ఇండియా రాష్ట్ర సమన్వయకర్త తాడూరి శ్రీనివాస్ ఆచార్య అన్నారు. గురువారం సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి వీణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, సమాజంలో యువత, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు లాంటి విషయాలను ఆయన వివరించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కథలాపూర్: గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్‌ను గురువారం ఉపాధ్యాయులు అందించారు. ఇంగ్లిష్ టీచర్ సంజీవ్‌రెడ్డి సొంతంగా ప్రింటెడ్ స్టడీ మెటీరియల్ తయారు చేశారు. వీటిని విద్యార్థులకు ఉచితంగా అందించారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి



జెండా ఆవిష్కరించిన బీఆర్ఎస్ శ్రేణులు

పెగడపల్లి: గ్రామాలభివృద్ధి బీఆర్ఎస్‌కే సాధ్యమని గత ప్రభుత్వం నిరూపించిందని మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. రాజరాంపల్లిలో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం గురువారం జరిగింది. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో సుమారు రూ.2కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. నాయకులు రవీందర్, రాజశేఖర్ గౌడ్, కిరణ్, కరుణాకర్‌రావు, కరుణాకర్‌రెడ్డి, కనకయ్య, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

బుగ్గారం: దుర్గా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలో ఏటా నిర్వహించే వేడుకల పోస్టర్‌ను మంత్రి లక్ష్మణ్‌కుమార్ ఆవిష్కరించారు. స్థానిక ఉత్సవ కమిటీ సభ్యులు మంత్రిని కలిసి పాల్గొనాలని ఆహ్వానించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కోరుట్ల: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం గోవిజ్ఞాన పరీక్షలు నిర్వహించారు. గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజ్ఞానం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

మోదీ ఫొటో పెట్టాలని వినతి

కోరుట్ల: మున్సిపల్ కార్యాలయంలో ప్రధాని మోదీ చిత్రపటం పెట్టాలని బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌ను వినతిపత్రం సమర్పించారు.

లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలి

ధర్మపురి: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని ప్రొఫెసర్ కాంతాకుమారి సూచించారు. పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లైఫ్ అండ్ విజన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



పెగడపల్లి: లింగాపూర్ నుంచి గొల్లపల్లి మండలం అగ్గిమల్ల వెళ్లే ప్రధాన రహదారిపై మలుపు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఇటీవల ఓ యువకుడు బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి మృతిచెందాడు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ, సెల్ నంబర్: 9440818090

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

స్థలం కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మేదరి సంఘం సభ్యులు

కథలాపూర్: మండల మేదరి సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్, ఎంపీడీవోకు గురువారం వినతిపత్రం అందించారు. మేదరి కులస్తులకు మేదరి వనం పెంచేందుకు పదెకరాల స్థలం కేటాయించాలని, కులవృత్తులను ప్రోత్సహించేందుకు రుణమివ్వించాలని కోరారు. మండల కేంద్రంలో సంఘం భవనం కోసం స్థలం మంజూరు చేయాలన్నారు. మేదరి సంఘం మండలాధ్యక్షుడు చిలివేరి రవి, ప్రధాన కార్యదర్శి కోన శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

రాయికల్: మేదరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా పట్టణంలో భరతమాత విగ్రహం నుంచి తహసీల్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ నాగార్జునకు వినతిపత్రం సమర్పించారు. మండల అధ్యక్షుడు చిలువేరి సురేశ్, పట్టణ అధ్యక్షుడు ఊరడి లక్ష్మీనర్సయ్య, నాయకులు చందనర్సయ్య, ఆశాలు, మల్లయ్య, ప్రతాప్, రాములు, రాజేశం, శేఖర్, గోపి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ప్రశంసాపత్రం, ఫలాలు అందిస్తున్న నాయకులు

కథలాపూర్: కథలాపూర్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఈ శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. 30 మంది యువకులు రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రక్తదానం చేసినవారికి ప్రశంసాపత్రం, అరటి, ఆపిల్ పండ్లు పంపిణీ చేసి అభినందించారు.

నూలు తయారీ పరిశ్రమ సందర్శన



పెగడపల్లి: మ్యాకవెంకయ్యపల్లిలోని నూలు తయారీ(వస్త్ర) పరిశ్రమను ఆదర్శ మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం సందర్శించారు. నూలు తయారు చేస్తున్న విధానం, ఉపయోగిస్తున్న ముడి సరుకులు, పరికరాల పనితీరును పరిశీలించారు.

ఆయిల్ బంతులతో దోమల నివారణ



మాదిగకుంటలో ఆయిల్ బాల్స్ వేస్తున్న డాక్టర్ రజిత, యూత్ సభ్యులు

రాయికల్: ఆయిల్ బాల్స్‌తో దోమలను నివారించొచ్చని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు ఒడ్నాల రజిత అన్నారు. గురువారం యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో పట్టణంలోని మాదిగకుంట, వీరాపూర్ క్లబ్ రోడ్డు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బంతులను వేశారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంప్లాయిమెంట్ అధికారి సత్తమ్మ అన్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

సర్వీస్ రూల్స్ సాధించాలి

జగిత్యాల: ఐక్యంగా ఉండి ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సాధిద్దామని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. జిల్లా కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.

3 నెలల వేతనాలు చెల్లించాలి

సారంగాపూర్: గ్రామ పంచాయతీల్లో వివిధ హోదాల్లో పని చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు బకాయి పడ్డ 3 నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల కార్మికులు మాట్లాడారు. ఈనెల 21 లోపు చెల్లించాలన్నారు.

నేడు పార్కు నిర్మాణానికి శంకుస్థాపన

రాయికల్: పట్టణంలోని పెద్ద చెరువు వద్ద చిల్డ్రన్ పార్క్ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శంకుస్థాపన చేయనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి గురువారం తెలిపారు.

శ్రమదానం

పెగడపల్లి: నంచర్లలో గురువారం మండల బీజేపీ శ్రేణులు శ్రమదానం చేపట్టారు. సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఏపుగా పెరిగిన చెట్లు, గడ్డిని తొలగించి శుభ్రం చేశారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 2 వరకు సేవాపక్షం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మోహన్‌రెడ్డి, మహేశ్, సత్యం, అనసూర్య, గట్టయ్య, జనార్దన్, తిరుపతి, సాయి, అనిల్, సురేశ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శ్రమదానం నిర్వహించారు. మల్లేశం, రమేశ్, ప్రసాద్, పరమేశ్, గంగాధర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యం

కోరుట్ల రూరల్: గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యమని విద్యుత్ ఏడీఈ రఘుపతి అన్నారు. నాగులపేట, వెంకటాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ప్రారంభించారు.

చర్యలు తీసుకోవాలి

ధర్మపురి: యాసంగి పంట కాలం డబ్బులు చెల్లించని వరి విత్తనోత్పత్తి ఆర్గనైజర్ల కంపెనీలపై చర్యలు తీసుకోవాలని జైనా, కోస్నూర్‌పల్లె శ్రీవినాయక రైతుమిత్ర సంఘం రైతులు డిమాండ్ చేశారు.

బ్యాగులు పంపిణీ

వెల్గటూర్: స్వగ్రామంపై మమకారంతో తన తల్లి జక్కుల మల్లవ్వ జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ప్లేట్లు, పుస్తకాలు పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నాడు కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ జక్కుల సుభాష్. కొన్నేళ్ల క్రితం మూతపడ్డ కుమ్మరిపల్లి ప్రాథమిక పాఠశాల ఈ సంవత్సరమే తిరిగి ప్రారంభించారు. స్థానికంగా విద్యనభ్యసించే పిల్లలకు చేయూతనందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.